

# లవ్ యూ టీచర్!

**అనగనగా** ఓ టీచర్, ఓ విద్యార్థిని. ఆ స్టూడెంట్ అంటే టీచర్‌కు చాలా ఇష్టం. తను చేసే అల్లరి అంటే ఇంకా ఇష్టం. ఆ టీచర్ అంటే ఆమెకు ప్రత్యేకమైన అభిమానం. బడి చదువు పూర్తయ్యాక ఇద్దరూ మళ్లీ కలుసుకోలేదు. కాలం గిర్రున తిరిగింది. పదమూడేండ్లు గడిచిపోయాయి. మళ్లీ ఓ రోజు ఆ అల్లరిపిల్ల ఈ టీచర్ ఇంటి తలుపుతట్టింది. 'హాయ్ మేడం' అంటూ పలకరించింది. ఆ మాటతీరుతో వచ్చిందెవరో ఇట్టే తెలుసుకుంది. తనను వెతుక్కుంటూ వచ్చిన విద్యార్థినిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది. ఆ స్టూడెంట్ పేరు అలీషా, టీచర్ పేరు రేవ్స్! 13 ఏండ్ల కిందట వాళ్లిద్దరూ కలిసి దిగిన చిత్తరువు, లేటెస్ట్ ఫొటోను ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసింది. ఈ గురుశిష్యుల ఫొటో ఎక్స్‌లో వైరల్ అయింది. తన ఉపాధ్యాయురాలిని ఆదర్శంగా తీసుకున్న అలీషా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు టీచర్ కావడం ఇక్కడి విశేషం.



నమస్తే తెలంగాణ

# జిందగీ


11

హైదరాబాద్ | శనివారం 23 మార్చి 2024 www.ntnews.com




# బిజినెస్ టఫ్ఫే.. మల్లిక మేడ్ ఈజీ

Mallika Srinivasan



**భారతదేశానికి రైతు వెన్నెముక. ఆ రైతుకు వెన్నుదన్ను ట్రాక్టర్! ఇది అందుబాటులోకి వచ్చాక కర్షకుడి కాయకష్టం కాస్త తగ్గింది. ఆ ట్రాక్టర్ల ఉత్పత్తిలో ఎందరెందరు ఉన్నా... టఫే ప్రస్థానం ప్రత్యేకమైనది. తండ్రి వారసత్వంగా వచ్చిన వ్యాపార సామ్రాజ్యాన్ని ఒంటిచేత్తో నిలబెట్టిన ఘనత ఆ సంస్థ చైర్‌పర్సన్ మల్లికా శ్రీనివాసన్‌కు చెల్లుతుంది. పురుషాధిక్య వ్యాపార సామ్రాజ్యాన్ని శాసిస్తూ... లాభాల లెక్కలు తేలుస్తున్నది. దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన మహిళా సీఈవోల్లో ఒకరిగా, ట్రాక్టర్ రారాణిగా ఎదిగిన ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) అధినేత్రి మల్లికా శ్రీనివాసన్ ప్రస్థానం ఇది..**

పెద్దయ్యాక ఏమవుతావ్? ఈ ప్రశ్నకు చాలామంది దగ్గర సరైన జవాబు ఉండదు. స్పష్టత లేనివాళ్లకు ఏ ఇబ్బందీ లేదు. డాక్టర్‌ను చూడగానే డాక్టర్ అవ్వాలనీ, నచ్చిన టీచర్ తారసపడితే.. ఆమెలా ఉపాధ్యాయురాలు కావాలనీ భావిస్తుంటారు. కానీ, పెద్దయ్యాక ఏమవ్వాలో స్పష్టత ఉన్నవాళ్లకే పెద్ద సమస్య! చదువులో తడబడ్డా, మార్కుల్లో వెనుకబడ్డా తన లక్ష్యం అందుకోలేనేమో అని కంగారు మొదలవుతుంది. ఆ స్థానంలో ఓ వ్యాపారవేత్త కూతురు ఉంటే! ఆమె సంఘర్షణ ఇంకెలా ఉంటుందో ఊహించుకోవచ్చు. మల్లికా శ్రీనివాసన్‌దీ ఇదే పరిస్థితి. తండ్రి శివశైలం ఆటోమొబైల్ రంగంలో రారాజు. ఆమె పుట్టేనాటికే వాళ్లకు పరిశ్రమలు ఉన్నాయి. మల్లిక పెరిగే కొద్దీ.. వాళ్ల పరిశ్రమ మరింత విస్తరించింది.

### బిజినెస్ దిశగా..

ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే)కు మాతృసంస్థ 'ది అమల్గమేషన్స్ గ్రూప్'! మల్లిక వాళ్ల తాతయ్య దీనిని ప్రారంభించారు. కొన్నాళ్లకు సంస్థ పగ్గాలు శివశైలం అందుకున్నారు. ఆటోమొబైల్ రంగంలో ఈ సంస్థది తిరుగులేని ఆధిపత్యం. ట్రాక్టర్లు, వ్యవసాయ ఉపకరణాల ఉత్పత్తుల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన సంస్థగా పేరొందింది. 'ఏం కావాలన్నది నీ ఇష్టం!' అని తల్లిదండ్రులు మల్లికకు చిన్నప్పుడే స్వేచ్ఛనిచ్చారు. ఆమె మాత్రం వ్యాపారవేత్తగా రాణించాలని ఏనాడో బలంగా నిశ్చయించుకున్నారు. అందుకు తగ్గట్టుగా మేనేజ్‌మెంట్ విద్య చదివారు. మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ ఎకనామిక్స్ పూర్తిచేశారు. అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్నారు. వ్యాపార సూత్రాలన్నిటినీ వల్లె వేసి తండ్రి వ్యాపార సంస్థలో ఉద్యోగిగా ప్రస్థానం మొదలుపెట్టారు మల్లిక.


> *వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదిగిన మల్లికా శ్రీనివాసన్‌ను జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఎన్నో వరించాయి. 2022 సంవత్సరానికి గానూ ఫోర్బ్స్ నుంచి ఆసియాలో శక్తిమంతమైన 50 మంది మహిళా వ్యాపారుల్లో ఆమె చోటు దక్కించుకున్నారు. శివశైలం 2007లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకోగా, మల్లిక 2014లో ఈ అవార్డుకు ఎంపికయ్యారు.*

### 82 దేశాల్లో..

టఫెలో జనరల్ మేనేజర్‌గా పనిచేసిన ఆమె ఇప్పుడు ఆ సంస్థకు చైర్‌పర్సన్ స్థాయికి ఎదిగారు. సంస్థ లాభాలను ఏటికేడూ పెంచుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకున్నారు. టఫెను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ట్రాక్టర్ తయారీ సంస్థగా నిలబెట్టారు. ఈ విజయం ఆమెకు అనుకున్నంత తేలికగా రాలేదు. ముప్పయ్ ఏండ్ల వ్యాపార ప్రస్థానంలో మల్లికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. విపత్కర పరిస్థితులూ వచ్చాయి. అన్నిటినీ ఎదుర్కొని నిలబడ్డారు. ట్రాక్టర్ల తయారీ, అమ్మకం, ఆదాయాల పరంగా మనదేశంలో 'మహీంద్రా' తర్వాతి స్థానంలో టఫే ఉండటం ఆమె వ్యాపార దక్షతకు రుజువు. ప్రపంచవ్యాప్తంగా 82 దేశాల్లో ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తున్నది అంటే ఆమె ఎంత సమర్థంగా పనిచేస్తున్నదో అంచనాకు రావొచ్చు.

### నచ్చిన దారిలో..

తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగానో, సమాజ పోకడలను అనుసరించో, స్నేహితుల ప్రభావంతోనో చాలామంది యువతీయువకులు తమకు ఆసక్తి లేని రంగాల వైపు బలవంతంగా వెళ్తుంటారు. కానీ, మనసుకు నచ్చిన, మనం మెచ్చిన దారిలో నడిస్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించొచ్చు అంటారు మల్లిక. అంతేకాదు, స్త్రీ సాధికారతకు ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తున్నారు. వర్క్‌ప్లేస్‌లో మహిళల సంఖ్య అధికంగా ఉండాలని ఆమె ఎప్పుడూ చెబుతుంటారు. అందుకు తగ్గట్టుగా తన సంస్థలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దివ్యాంగ మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మరోవైపు సామాజిక సేవలోనూ మల్లిక చొరవ అద్భుతం. తల్లిదండ్రుల పేరిట 'ఇందిరా శివశైలం' ట్రస్ట్ స్థాపించి విద్య, వైద్య సంస్థలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. కర్ణాటక సంగీతం ప్రాచుర్యానికి కృషి చేస్తున్న మల్లికా శ్రీనివాసన్ నేటి మహిళా లోకానికి ఆదర్శం!!



## బేర్ గ్రేటర్!

**కొంతమందికి** వంటింటిని అందంగా సర్దుకోవడం ఇష్టం ఉంటుంది. అక్కడ వాడే వస్తువులన్నిటినీ ప్రత్యేకంగా కొనుక్కొని వరుసలో పెట్టుకుంటారు. అలాంటి చోట ఓ ముచ్చటైన బొమ్మ కూడా ఉంటే మరింత బాగుంటుంది కదూ! అలాంటి సరదా ఉన్న వాళ్లకోసం తయారు చేసింది బారీ గ్రేటర్. ఎలుగుబంటి బొమ్మ ఆకృతిలో ఉండే దీని వెనుక తురమడానికి అనువుగా గ్రేటర్ ఉంటుంది. కొబ్బరి, క్యారెట్, బీట్‌రూట్‌లాంటివి ఏమైనా దీనితో తురుముకోవచ్చు. అదంతా బొమ్మ పొట్టలో ఉంటుందన్నమాట. దాన్ని తెరిచి తురుమును తీసుకోవచ్చు. ముచ్చటగా ఉన్న ఈ గ్రేటర్ మీకూ నచ్చిందా!




# బరువు దించే పంచతంత్రం

**జీవక్రియలు సజావుగా సాగినప్పుడు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. కానీ, కొన్ని పరిశోధనల ప్రకారం ప్రతి పదిమందిలో ఏడుగురు అయితే అజీర్ణ సమస్యతో లేదంటే అధిక బరువుతో బాధపడుతున్నారట. వీళ్లలో చాలామంది బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నవాళ్లే! అయితే, కొన్నిరకాల ఆహార పానీయాలతో బరువుకు చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. వీటివల్ల జీర్ణక్రియ సమస్యలను నియంత్రించొచ్చు అని చెబుతున్నారు. అవేంటంటే..**



**సోంపు పానీయం:** మృష్టాన్న భోజనం తర్వాత సోంపు తింటే.. జీవక్రియ వేగం హెచ్చుతుందని మనకు తెలిసిందే! గ్లాసు నీటిలో ఒక టేబుల్ స్పూన్ సోంపు వేసి మరగనివ్వాలి. తర్వాత వడగట్టుకొని, చల్లారాక తాగాలి. దీనివల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. పొట్ట ఉబ్బరం తగ్గి, జీవక్రియలు వేగవంతమై బరువు తగ్గే అవకాశం ఉంటుంది.



**కొకుం జ్యూస్:** కొకుం పండులో పోషకాలు అధికంగా ఉంటాయి. ఇది శరీరంలోని వేడిని తగ్గించడంతోపాటు తక్షణ శక్తిని ఇస్తుంది. దీన్ని సమ్మర్ సూపర్ ఫ్రూట్‌గా అభివర్ణిస్తారు కూడా! కొకుం జ్యూస్‌తో ఎసిడిటీ తగ్గుతుంది. అజీర్తితో బాధపడుతున్న వాళ్లు కొకుం జ్యూస్ తాగితే ఉపశమనం పొందొచ్చు. శరీరంలోని చెడు కొవ్వు నిల్వల్ని ఇది నివారిస్తుంది.



**తులసి టీ:** వాకిటి కోటలో నిలిచిన తులసి ఆరోగ్యప్రదాయిని. రోగ నిరోధకశక్తిని పెంచడంలో తులసి ఉత్పత్తులు క్రియాశీలకంగా పనిచేస్తాయి. తులసి టీ క్రమం తప్పకుండా తాగితే జీవక్రియ మెరుగుపడుతుంది. కొవ్వును తగ్గించడంతోపాటు ఊబకాయాన్నీ తులసి టీ నిరోధిస్తుంది.



**బార్లీ టీ:** బార్లీలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ ఆకలిని తగ్గిస్తుంది. బార్లీ నీటిని తాగడం ద్వారా శరీరంలో కేలరీలు ఖర్చవడంతోపాటు జీవక్రియ మెరుగుపడుతుంది. రెగ్యులర్‌గా బార్లీ టీ తాగడం వల్ల ఊబకాయం తగ్గుతుంది.



**అలోవెరా జ్యూస్:** శరీర బరువు తగ్గించడంలో కలబంద బలంగా పనిచేస్తుంది. భోజనానికి 15 నిమిషాల ముందు ప్రతి రోజూ ఒక టీ స్పూన్ అలోవెరా జ్యూస్ తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది. జీవక్రియల వేగం పెంచడంతోపాటు కొవ్వును నియంత్రిస్తుంది.

# 40 ఇయర్స్ @ ఇండస్ట్రీ

చిన్నతెర

**బాలనటిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన మీనా అనగానే మనకు 'సీతారామయ్యగారి మనవరాలు' గుర్తొస్తుంది. 'అల్లరిపిల్ల' అనిపిస్తుంది. 'ప్రెసిడెంట్ గారి పెళ్లాం'లో గడసరి సొగసరి కండ్లముందు కదలాడుతుంది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ.. ఇలా దక్షిణాది భాషల్లో స్టార్ హీరోలతో నటించి సూపర్ హీరోయిన్ అనిపించుకున్నది. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తన నటనా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఈ వెండితెర వెలుగుల రాణి ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులనూ అలరిస్తున్నది. జీ తెలుగులో ప్రసారమవుతున్న 'సెలబ్రిటీ డ్యాన్స్ షో సూపర్ జోడీ'కి జడ్జిగా వ్యవహరిస్తున్నది మీనా. ఈ సందర్భంగా ఆమె 'జిందగీ'తో పంచుకున్న అనుభవాలివి..**



**నటిగా** నా ప్రయాణం ఎప్పుడూ ఆనందంగానే సాగింది. బాలనటిగా అద్భుతమైన పాత్రలు పోషించాను. హీరోయిన్‌గా అందరు సూపర్‌స్టార్లతో నటించాను. వ్యక్తిగత కారణాల వల్ల కొన్నాళ్లు పరిశ్రమకు దూరమైనా ఏదో ఒకరకంగా అభిమానులకు దగ్గరగానే ఉన్నాను. ఒక నటిగా ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నాను. ప్రస్తుతం ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటున్నాను. దృశ్యం, దృశ్యం 2 చిత్రాలు నన్ను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. వెండితెరపైనే కాకుండా టెలివిజన్ ద్వారా కూడా ప్రేక్షకులను పలకరించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది.

### డ్యాన్సర్లు కాకపోయినా..

నటిగానే కాకుండా వ్యక్తిగతంగానూ నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. డ్యాన్స్ రియాలిటీ షోలో పాల్గొనడం నాకు ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. ఇలాంటి ప్రతిభావంతులతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఇతర షోల కంటే 'సూపర్ జోడీ' భిన్నమైనది. పోటీదారుల అంకిత భావం, కష్టపడే తత్వం చూడముచ్చటగా అనిపిస్తున్నది. ఈ కంటెస్టెంట్లు ప్రొఫెషనల్ డ్యాన్సర్లు కాకపోయినా చాలా కష్టపడుతున్నారు. న్యాయనిర్ణేతగా లోటుపాట్లు చెప్పడం నా బాధ్యత. కానీ, కొన్నిసార్లు తప్పొప్పులు చెప్పడానికి సంకోచించాల్సి వస్తుంది. ఏదైనా కామెంట్ వాళ్లను బాధపెడుతుందేమో అని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటాను. ఏదేమైనా... న్యాయనిర్ణేతగా నేను కరెక్ట్‌గా ఉండాలి. నా జడ్జ్‌మెంట్‌ను వాళ్లు సానుకూలంగా స్వీకరిస్తుండటం సంతోషంగా ఉంది.



### జ్ఞాపకాల్లోకి..

ఈ షో ద్వారా నా పాత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తున్నాయి. స్టేజ్ మీద నా పాటకు ప్రదర్శన ఇచ్చినప్పుడు, నోస్టాల్జీ అనుభూతి కలుగుతుంది. ఆ పాట షూటింగ్ సంగతులు, ఆ సినిమా ముచ్చట్లు మదిలో కదలాడుతాయి. ఇక ఈ షో షూటింగ్ అంటారా చాలా సరదాగా సాగిపోతుంది. ఒకప్పటికీ ఇప్పటికీ డ్యాన్స్‌లో చాలా మార్పులు వచ్చాయి. గతంలో డ్యాన్స్ అంటే చాలా సింపుల్ మూమెంట్స్ ఉండేవి. రియాలిటీ షోలు డ్యాన్స్‌ను మరోస్థాయికి తీసుకెళ్లాయి. సెట్, కాస్ట్యూమ్స్ ఇలా ప్రతి విషయంలోనూ పర్‌ఫెక్షనిజం కనిపిస్తున్నది. ఈ కళలో కొత్తకోణాన్ని ప్రత్యక్షంగా చూడటం అద్భుతంగా ఉంది. ఎలిమినేషన్ జరిగిన ప్రతిసారీ చాలా బాధపడతాను. కానీ, ట్రోఫీని ఒక్కరే దక్కించుకోగలరు కదా!

**సినీ** పరిశ్రమలో అడుగుపెట్టి నలభై సంవత్సరాలు పూర్తయింది. ఈ నేపథ్యంలో ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా నన్ను గౌరవించడం చాలా సంతోషం అనిపించింది. ఈ ప్రయాణంలో నాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. నేను పోషించిన పాత్రల చిత్రాలతో అలంకరించిన చీర బహుమతిగా ఇచ్చి జీ తెలుగు బృందం నన్ను ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.

... హరిణి